ఘనవ్యర్థాల నిర్వహణ భేష్

శంషాబాద్ మున్సిపాలిటీకి ప్రశంసాపత్రం



మున్సిపాలిటీ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అనిల్‌ను సత్కరించిన చైర్‌పర్సన్ సుష్మ

శంషాబాద్: స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణలో శంషాబాద్ మున్సిపాలిటీకి ఏఏఈటీఐ (అనిల్ అగర్వాల్ ఎన్విరాన్‌మెంట్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'ది చేంజ్ మేకర్ కాన్‌క్లేవ్'లో ప్రశంసాపత్రం లభించింది. ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అనిల్ ఈ ప్రశంసాపత్రాన్ని సంబంధిత అధికారుల నుంచి అందుకున్నారు. సుస్థిరమైన పర్యావరణ అభివృద్ధిలో ఘనవ్యర్థాల నిర్వహణ తీరుపై మున్సిపాలిటీ తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. ఈ మేరకు మంగళవారం ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అనిల్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ శాలువాతో సత్కరించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో మున్సిపాలిటీకి మంచిపేరు తీసుకురావడం హర్షణీయమని అభినందించారు. కార్యక్రమంలో ఏఈ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని సీపీఐ కార్యాలయం ఏఆర్ దేవరాజ్ భవనంలో వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ గోడ పత్రికను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు మాట్లాడుతూ అనేక పోరాటాలు, త్యాగాలు దేశ ప్రజల హక్కులు, వారి రక్షణ కోసం చట్టాలను తీసుకురావడంలో సీపీఐ ముఖ్యపాత్ర పోషించిందని అన్నారు. ఈ నెల 30న వందేళ్ల ఉత్సవాల సభ నల్లగొండలో రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ సహాయ కార్యదర్శి విజయ్ ఆనంద్‌గౌడ్, బీసీ సంఘం జిల్లా నాయకులు సదానందగౌడ్, జిల్లా సమితి సభ్యులు జి.ఆనంద్ గౌడ్, సీనియర్ జిల్లా నాయకులు జి.సత్యనారాయణ, సీనియర్ నాయకులు కొల్లెం లక్ష్మయ్య, ఏఐటీసీ పార్టీ సీనియర్ నాయకులు బండి నరసింహా, కృష్ణ, సీపీఐ నాయకులు మద్దూరి కృష్ణ, పద్మ, మహిళా నాయకురాలు శాలిని, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో డ్రైవర్‌కు గాయాలు



విద్యుదాఘాతానికి గురైన సయ్యద్ మొహ్మద్ ఆలీ

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుదాఘాతానికి గురైన ఓ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మైలార్‌దేవ్‌పల్లి ఏఎస్సై స్వరాజ్యం తెలిపిన వివరాల ప్రకారం ... జలాల్ బాబానగర్‌కు చెందిన సయ్యద్ మొహ్మద్ ఆలీ(27) కామారెడ్డిలోని తులసీ ఇండస్ట్రీలో డీసీఎం డ్రైవర్. కాటేదాన్ పారిశ్రామికవాడ నుంచి సరుకులు సరఫరా చేస్తుంటారు. మంగళవారం సరుకు నింపుకునేందుకు కాటేదాన్ బుద్వేల్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న శ్రీరామ్‌నగర్ పరిశ్రమకు వెళ్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద డీసీఎంను నిలిపాడు. అతి దగ్గరగా నిలిపి ఉంచడంతో డీసీఎంకు విద్యుత్ షాక్ తగిలింది. కిందికి దిగుతుండగా ఒక్కసారిగా విద్యుత్‌ఘాతానికి గురై ఎగిరిపడ్డాడు. ఈ ప్రమాదంలో కడుపు, ఎడమ చేయి పూర్తిగా షాక్‌కు గురైంది. అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మైలార్‌దేవ్‌పల్లి: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గోనె సంచిలో తీసుకువచ్చి పడేసిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం... కాటేదాన్ దుర్గానగర్ చౌరస్తా నుంచి ఆరాంఘర్ చౌరస్తా వెళ్లే మార్గంలోని హ్యాపీ వైన్స్ ఎదురుగా ఉన్న వాలర్‌లెస్ డ్రైనేజీలో ఓ గుర్తుతెలియని మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే సంఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించగా సుమారు 30- 35 సంవత్సరాల వ్యక్తిని ఎక్కడో హత్య చేసి ప్లాస్టిక్ గోనె సంచిలో తెచ్చి ఈ ప్రాంతంలో పడేసినట్లు గుర్తించామన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

దుప్పట్ల పంపిణీ

గోల్కొండ: అనాథలు, నిరుపేదలకు 14 ఏళ్ల నుంచి చలికాలంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని కాంగ్రెస్ నాయకుడు ఆసిఫ్‌హుస్సేన్ సోహెల్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ, షేక్‌పేట్, మెహిదీపట్నం, నానల్‌నగర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు, బస్ షెల్టర్ల వద్ద ఉండే నిరుపేదలు, అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసిఫ్‌హుస్సేన్ సోహెల్ వింటర్ డ్రైవ్ పేరుతో నిరంతరంగా ప్రతి చలికాలంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి సమష్టికృషి

నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల ప్రజాసమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేద్దామని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆమె అధ్యక్షతన మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డితోపాటు ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ ఐటీ జోన్‌కు సమీపంలో ఉండటం, రోజురోజుకూ టవర్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, ప్రజలు పెరిగిపోతుండటంతో అదే స్థాయిలో సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. వాటి పరిష్కారానికి పక్కా ప్రణాళికతో కృషి చేయాలన్నారు. విద్యుత్, నీటి సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని కౌన్సిలర్‌లు కోరారు.

ఇవే తీర్మానాలు..

మున్సిపాలిటీ పరిధిలో మొత్తం రూ. 21.41 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని తీర్మానాలు చేశారు. అందులో సీసీ రోడ్లకు రూ.1.35 కోట్లు, బీటీ రోడ్లకు రూ.62 లక్షలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.1.40 కోట్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలకు రూ. 6.65 కోట్లు, శ్మశాన వాటికల్లో వసతులకు రూ. 50 లక్షలు, అన్ని వార్డుల్లో వీధిదీపాల ఏర్పాటుకు రూ.70 లక్షలు, ప్రహరీల నిర్మాణ పనులకు రూ. 35 లక్షలు, పారిశుధ్య పనులకు రూ. 1.03 కోట్లు, సర్కిల్స్ అభివృద్ధికి రూ. 50 లక్షలు, నీటి సరఫరా పైప్‌లైన్‌లు, మెయింటెనెన్స్‌లకు రూ. 4.69 కోట్లు, వట్టినాగులపల్లి నుంచి జవహర్‌నగర్‌కు చెత్త తరలింపునకు రూ.2 కోట్లు, ఇతర పనులకు రూ.1.62 కోట్లను ఖర్చు చేయాలని తీర్మానం చేశారు. సమావేశంలో డీఈ నరేష్‌కుమార్, మేనేజర్ యోగేష్, మున్సిపల్ ఏఈ శ్రీనివాస్, విద్యుత్ ఏఈ మణికంఠ, జలమండలి మేనేజర్ రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్‌లు

నేషనల్ చెస్ పోటీల్లో నగర విద్యార్థిని ప్రతిభ



చాంపియన్‌షిప్‌లో పోటీపడి 6వ స్థానంలో నిలిచిన శివాంశిక

అత్తాపూర్: పశ్చిమ బెంగాల్‌లో జరిగిన 37వ నేషనల్ అండర్–13 బాలికల ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌లో అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన కుమారి జి.శివాంశిక 6వ స్థానంలో నిలిచింది. డిసెంబర్ 17 నుంచి 23వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో భాగంగా 137 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఒడిశా, తమిళనాడు, మహారాష్ట్ర, హరియాణా, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులతో పోటీపడి తనదైన శైలిలో ఆటను కొనసాగిస్తూ తెలంగాణ కీర్తిని శివాంశిక మరింతగా పెంచింది. శివాంశిక బెస్ట్ పెర్ఫార్మెన్స్ ప్రదర్శిస్తూ ఊహకు అందని విధంగా ఎత్తుకు పైఎత్తు వేస్తూ ఆడిన ఆట క్రీడాకారులను ఆకట్టుకుంది. దీంతో నిర్వాహకులు ఆమెను ఘనంగా సత్కరించారు. సర్టిఫికెట్‌తోపాటు 25 వేల రూపాయల నగదు బహుమతిని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అత్తాపూర్‌లోని మెస్ట్రో చెస్ అకాడమీ కోచ్ అమిత్‌పాల్‌సింగ్, అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఫిజికల్ డైరెక్టర్ గంగ్యానాయక్, సాయిప్రసాద్‌రావు, చంద్రశేఖర్ ఆ బాలికను అభినందించారు. ఈ అమ్మాయిని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తే భవిష్యత్తులో గ్రాండ్ మాస్టర్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారాలు



మైలార్‌దేవ్‌పల్లి: ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలిపురం, న్యూ దుర్గానగర్, బాబుల్‌రెడ్డినగర్ బస్తీ సమస్యలపై పర్యటించారు. భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులను, నూతన సీసీ రోడ్లను జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి నాణ్యతాలోపాలు లేకుండా ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా పనులు పూర్తి చేయాలన్నారు. దుర్గానగర్‌లోని నాలాపై స్లాబ్ పనుల కోసం ప్రాజెక్టు ఆఫీస్‌లో మాట్లాడినట్లు చెప్పారు. బాబుల్‌రెడ్డినగర్‌లో రెయిన్ వాటర్, డ్రైనేజీ లైన్ అవసరం ఉన్న చోట పొడిగించాలని, పనుల అనంతరం సీసీ రోడ్డు వేయాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భాను, జలమండలి మేనేజర్ ఖాదర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ లోక్‌నాథ్, జాషువా, ప్రకాష్, స్థానిక నాయకులు కృష్ణ, ఎల్.వి.రెడ్డి, జంగారెడ్డి, వెంకటరమణగుప్తా, మన్మోహన్‌రెడ్డి, తలారి చిన్న, శ్రీకాంత్‌రెడ్డి, పాండు యాదవ్, కృష్ణయాదవ్, రమేష్‌రెడ్డి, శంకర్, గోపాల్ నాయక్, మధుసుధన్, శేఖర్ పాల్గొన్నారు.

మంచిరేవులలో 'కాకతీయ' ఆనవాళ్లు



దేవాలయ ఆవరణలోని విగ్రహాలను పరిశీలించిన శివనాగిరెడ్డి



అసంపూర్తిగా ఉన్న నంది విగ్రహాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

- కాపాడుకోవాలంటున్న పురావస్తు పరిశోధకుడు
- అరుదైన వీరభద్రుడి విగ్రహం లభ్యం

మణికొండ: గండిపేట మండలం మంచిరేవుల గ్రామంలో చాళుక్య, కాకతీయుల కాలంనాటి ఆనవాళ్లు ఉన్నాయని, వాటిని కాపాడుకుని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రముఖ పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన బృందంతో కలిసి చారిత్రక ఆనవాళ్లను గుర్తించే పనిలో భాగంగా మంచిరేవుల మచిలేశ్వరాలయం, వీరభద్రస్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మూసీనదికి కుడివైపున వీరభద్రాలయం యోని ఆకారంలో గల పానవట్టం, దాని పైనున్న శివలింగం క్రీ.శ 8వ శతాబ్ది చాళుక్యుల కాలానికి చెందినదని పేర్కొన్నారు. ఉత్తరం వైపున ఉన్న భిన్నమైన వీరభద్రుని విగ్రహం క్రీ.శ. 13వ శతాబ్ది కాకతీయుల కాలం నాటిదన్నారు. వీరభద్రుడు కుడివైపున కత్తి, బాణం, ఢమరుకం, ఎడమవైపున డాలు, విల్లు, శూలం ధరించి, శరీరం అన్ని ఆభరణాలతో అలంకరించి ఉందన్నారు. ఆలయ ప్రవేశ మార్గంలో అసంపూర్తిగా చెక్కిన నంది శిల్పం సైతం కాకతీయుల కాలంనాటిదేనని తెలిపారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ విగ్రహాలను భద్రపరచి, కాపాడుకోవాలని ఆలయ వంశపారంపర్య అర్చకులు మాడపాటి పరమేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ శివారులోని మంచిరేవుల చరిత్ర 1,200 ఏళ్ల ప్రాచీనత కలిగిన చాళుక్య కాలం నాటిదన్నారు. ఈ కార్యక్రమంలో వారసత్వ కార్యదర్శి పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి, ఆలయ అర్చకుడు మాడపాటి పరమేశ్వర్‌లతోపాటు వారి బృందసభ్యులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

లంగర్‌హౌస్: ఆర్యవైశ్య సంఘం లంగర్‌హౌస్ డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లంగర్‌హౌస్ డివిజన్‌కు సంబంధించి నూతన కమిటీని గౌరిశెట్టి బాబురావు, ముసత్యాల శ్రీనివాస్, కె.వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విప్పు మధూర్, ప్రధానకార్యదర్శిగా రెడ్డి శెట్టి కృష్ణమూర్తి, కోశాధికారిగా వేముల రాములు, పీఆర్‌ఓలుగా దశరథం, ప్రవీణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు దేసు వెంకటేశ్వర్లు, మలిపెద్ది రాములయ్య, కె.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలి



బాబుల్‌రెడ్డినగర్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజల ఇబ్బందులను అధికారులు ఎప్పటికప్పుడు తొలగించాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం బాబుల్‌రెడ్డినగర్‌లో జరుగుతున్న రోడ్, డ్రైనేజీ పనులను పర్యవేక్షించారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. 300 బస్టాప్, రైల్వే గేట్ ఓపెన్ నాలా, రోడ్డుపైన ఉన్న స్తంభాలతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని, వీటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్‌రెడ్డి, వెంకటరమణ గుప్తా, గోపాల్‌నాయక్, మధుసుధన్, పాండుయాదవ్, తలారి చిన్న, మన్మోహన్‌రెడ్డి, శంకర్, శేఖర్, కిరణ్ తదితరులున్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సత్తా



సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న రాజేంద్రనగర్ ఎంఈవో శంకర్‌రాథోడ్

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు అన్ని రంగాల్లో పాలు పంచుకున్నప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారని రాజేంద్రనగర్ ఎంఈవో శంకర్‌రాథోడ్ అన్నారు. రాష్ట్ర బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో రాజేంద్రనగర్ మండల విద్యార్థులు టాపర్స్‌గా నిలిచారు. ఇంగ్లిష్ మీడియంలో గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.కార్తీక్, మైలార్‌దేవ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.శ్రీలేఖ, అత్తాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన బి.వసంతి, తెలుగు మీడియంలో మైలార్‌దేవ్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన డి.రాజ్‌కుమార్, అత్తాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన శివత్రివేణి, మైలార్‌దేవ్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన బి.సుషాంత్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈవో అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొని సత్తాచాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, జిల్లా టీబీఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి మాణిక్యం రెడ్డి, రాజేంద్రనగర్ మండల ఇన్‌చార్జి రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి తెరపైకి వివాదాస్పద భూమి కబ్జా

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని హెచ్‌ఎండీఏ, ప్రయివేటు వ్యక్తుల మధ్య ఉన్న వివాదాస్పద భూముల వ్యవహారం మరోమారు తెరపైకి వచ్చింది. సర్వే నంబరు 725 భూముల్లో హెచ్‌ఎండీఏ అవార్డును రద్దు చేసినట్లు ఇటీవల హైకోర్టు ధ్రువీకరించిన నేపథ్యంలో భూములు తమవేనంటూ కోర్టులో పోరాడుతున్న వ్యక్తులు సంబంధిత భూములను రెండురోజులుగా తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రవీందర్ దత్‌ను వివరణ కోరగా 'ఆ స్థలం విషయమై మహ్మద్ మోయినుద్దీన్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. హెచ్‌ఎండీఏ అవార్డును హైకోర్టు రద్దు చేసినట్లుగా కోర్టు ధ్రువీకరించడంతో ఆ స్థలం తమదంటూ స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. అయితే ఈ విషయం ఇంకా కోర్టు పరిధిలోనే ఉంది. వచ్చే నెల 6న విచారణ ఉంది. ప్రభుత్వం నుంచి కౌంటర్ దాఖలు చేయనున్నాం. తదుపరి హైకోర్టు ఇచ్చే తీర్పు ఆధారంగా చర్యలుంటాయి.

1990 అవార్డు రద్దు చేశారు..

పట్టాదారులకు కాకుండా కౌలుదారులకు పరిహారం చెల్లించిన కారణంగా హెచ్‌ఎండీఏ 1990 అవార్డును గతంలోనే హైకోర్టు రద్దు చేసినట్లు ఇటీవల ధ్రువీకరించిందని పట్టాదారుల తరఫు న్యాయవాది మీడియాకు వివరించారు. పట్టాదారులపైనమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు కోర్టులో క్వాష్ అయ్యాయన్నారు. కోర్టు ఇచ్చే తీర్పులను సంబంధిత విభాగాలు గౌరవించాలని కోరారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణే కీలకం


జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాల ఇన్‌చార్జి అధికారి గంప శ్రీనివాస్

రాజేంద్రనగర్: వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఎంతో కీలకమైందని రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్ అన్నారు. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి వినియోగదారు తమ హక్కులను గుర్తించాలన్నారు. ప్రతి వస్తువు కొనుగోలులో వినియగదారులు ఆచితూచి వ్యవహరించాలని సూచించారు. సర్కిల్–3 సరూర్‌నగర్ విభాగం పౌర సరఫరాల సహాయాధికారి పుల్లయ్య మాట్లాడుతూ వినియోగదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా వినియోగదారుల ఫోరంను సంప్రదించాలన్నారు. విక్రయదారులు కూడా వినియోగదారుల చెల్లించే ప్రతి పైసాకు చట్టబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో వినియోగదారులు, రేషన్ డీలర్లు, గ్యాస్ ఏజెన్సీ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచి బీజేపీ బలోపేతం



పొట్ట అనిల్‌ను సన్మానిస్తున్న చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి

అత్తాపూర్: భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేస్తున్నామని చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని బూత్ నెంబర్ 201 బీజేపీ పోలింగ్ బూత్ కమిటీని శక్తి కేంద్రం ఇన్‌చార్జి కవేలిగూడం బాలకృష్ణ ఆధ్వర్యంలో నియమించారు. బూత్ అధ్యక్షుడిగా పొట్ట అనిల్‌కుమార్, కార్యదర్శిగా ఎర్ర శ్రీనివాస్, లాభార్తి ప్రముఖ్‌గా ఎర్ర రమేష్‌బాబు, మన్ కీ బాత్ ప్రముఖ్‌గా శ్రీనివాస్, వాట్సాప్ గ్రూప్ ప్రముఖ్‌గా భాగ్య, బీఎల్ఏగా ఎర్ర హరినాథ్, కార్యవర్గ సభ్యులుగా ప్రభాకర్, అరుణ్, మహేందర్, పవన్, పద్మ, సుధా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రావుల జగన్, డివిజన్ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పొట్ట గాయత్రి తదితరులు పాల్గొన్నారు.